## క్లుప్తంగా

### కలెక్టర్‌ను కలిసిన కె.కె.రాజు



కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గంలో రోడ్లు, ఇళ్ల పట్టాలు, నూతన రైతుబజార్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, యూబీసీ ల్యాండ్‌కు సంబంధించి ముస్లింలు ఈద్గా స్థలం కోసం, పలు అభివృద్ధి పనులపై ఆయనకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

### ఎస్సీ వసతి గృహం సందర్శన



వసతి గృహం వద్ద రాకేష్ చంద్ర

సీతమ్మధార: మోదీ మాట.. హాస్టల్స్ బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ ఆదేశాల మేరకు సీతమ్మధారలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని జిల్లా అధ్యక్షుడు గనిరెడ్డి రాకేష్ చంద్ర సందర్శించారు. గృహంలోని వసతులను పరిశీలించారు. విద్యార్థులతో కొద్ది సేపు మాట్లాడారు. విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి



పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళులర్పిస్తున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: బీజేపీకి పటిష్ట పునాదులు వేసిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ బలిదాన్ దివాస్ సందర్భంగా ఆదివారం స్థానిక బీజేపీ ఉత్తర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి పరుశురామ్ రాజు, సురేష్‌బాబు, రమణ, రాంబాబు, శంకరరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

### సృజనాత్మకంగా స్టోరీ టెల్లింగ్



ఆర్ట్‌స్కేపింగ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార: విశాఖ పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆర్ట్‌స్కేపింగ్(బొమ్మలు గీసి వాటి ద్వారా కథను వివరించడం) కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 5వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కథకురాలు సీతాశ్రీనివాస్ 'అప్పలాచియన్' జానపద కథను ఆర్ట్‌స్కేపింగ్ ద్వారా విద్యార్థులకు వివరించారు. జానపద కథలను వినూత్న రీతిలో సృజనాత్మకంగా ఆమె ఆవిష్కరించారు. విద్యార్థులతో బొమ్మలు గీయించి, వాటి ద్వారా కథలో లీనమయ్యేలా చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సింహాచలేశుడికి స్వర్ణ సంపెంగలతో అర్చన

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ సంపెంగలతో పుష్పార్చన చేశారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ నిర్వహించారు.




# వైభవోపేతంగా శ్రీనివాస కల్యాణోత్సవం



టీపీటీ కాలనీలో శ్రీనివాసుడికి తిరువీధి నిర్వహిస్తున్న ఉత్సవ నిర్వాహకులు



శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార: స్థానిక టీపీటీ కాలనీలోని ద్రావిడ సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో శృతిలయ ఆధ్యాత్మిక భక్తి సంకీర్తన సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం వైఖానస ఆగమ సంప్రదాయంలో రంగనాథ ఆచార్యులు బృందంచే భక్తజనుల గోవింద నామస్మరణల మధ్య అంగరంగా వైభవంగా కల్యాణం జరిగింది. శృతిలయ బృందం గాయనీగాయకులు కల్యాణోత్సవంలోని మధుర ఘట్టాల సన్నివేశాలకు అనుగుణంగా అన్నమాచార్య సంకీర్తనలను మధురంగా ఆలపించారు. తిరువీధి మహోత్సవం సంప్రదాయ రీతిలో జరిగింది. తిరుమల దేవస్థానానికి చెందిన ఆధ్యాత్మిక వ్యాఖ్యాత శ్రీమాన్ అకెళ్ల విభీషణ శర్మ స్వామి, అమ్మవార్లకు దివ్య మంగళ హారతి ఇచ్చి కొబ్బరికాయకొట్టి తిరువీధిని ప్రారంభించారు. సీతమ్మధార త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నను మంగళధ్వని, వేద మంత్రాలతో కోలాటం, సంకీర్తనలు, శ్రీరామ చంద్రమూర్తి, నారదుని పౌరాణిక పాత్రలతో, శ్రీవిష్ణు సహస్ర నామం, గోవింద నామ సంకీర్తనలతో టీపీటీ కాలనీలోని ద్రావిడ కల్యాణ మండపం వద్దకు తిరువీధిగా తీసుకొచ్చారు. కార్యక్రమంలో కె.ఎ.రాజు, ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, వంకాయల సన్యాసిరాజు, డాక్టర్ ఎస్ఎస్ మూర్తి, ఏపీఎస్ మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా క్రీడా పోటీలు

- పోటాపోటీగా తలపడుతున్న జట్లు
- యువతలో జోష్ నింపుతున్న 'ఆడుదాం ఆంధ్రా'



వాలీబాల్ పోటీలో తలపడుతున్న విశాఖ, చిత్తూరు క్రీడాకారిణులు

ఏయూ క్యాంపస్: ఉత్సాహభరిత వాతావరణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఆంధ్రవిశ్వవిద్యాలయం మైదానాల్లో జరుగుతున్న పోటీలు నువ్వా...నేనా అన్నట్టు సాగుతున్నాయి. విజయాన్ని, అపజయాన్ని సమానంగా స్వీకరిస్తూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటుతున్నారు. ఆదివారం నిర్వహించిన ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

**ప్రణాళికాబద్ధంగా....**

పోటీలు ఎంతో ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయి. మూడు ప్రాంతాల్లో ఏక కాలంలో మూడు క్రీడాంశాలకు సంబంధించిన పోటీలను నిర్వహిస్తున్నారు. ఏయూ బాస్కెట్ బాల్ మైదానం పక్కనే రెండు వాలీబాల్ కోర్టుల్లో బాలురు, బాలికల వాలీబాల్ పోటీలను నిర్వహించారు. జిమ్నాజియం ఎదురుగా ఉన్న సువిశాల మైదానంలో ఖోఖో, కబడ్డీ పోటీలు జరిగాయి.

**పోటీలతో క్రీడలపై ఆసక్తి**

క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుంది. దీంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం, సామర్థ్యం వారికి తెలుస్తుంది. భవిష్యత్తులో శారీరక వ్యాయామానికి, క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనడానికి ఇది నాందిగా నిలుస్తుంది. ప్రస్తుతం క్రీడల్లో భాగస్వాములైన యువత భవిష్యత్తులో జరిగే టోర్నమెంట్‌లలో మరింత బాగా ఆడేందుకు తమనుతాము సమాయత్తం చేసుకునే అవకాశం ఉంటుంది. యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసే వేదికగా ఆడుదాం ఆంధ్రా నిలుస్తోందని క్రీడాకారులు, కోచ్‌లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**ఏర్పాట్లు భేష్**

క్రీడాకారుల కోసం క్రీడా వేదికల వద్ద చేస్తున్న ఏర్పాట్లు ఎంతో బాగున్నాయి. టిఫిన్, భోజనం సమయానికి ప్రాంగణాలకు చేర్చి, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నారు. క్రీడాకారులు కడుపు నిండా ఆహారం తీసుకుని ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రతి క్రీడా వేదిక వద్ద మంచినీటి సదుపాయం కల్పించడతో పాటు, టాయిలెట్స్‌ని జీవీఎంసీ ఏర్పాటు చేసింది. క్రీడా వేదికల వద్ద పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బంది తొలగిస్తున్నారు. క్రీడా మైదానం, పరిసరాలు ఎంతో పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. క్రీడాకారులకు, ఇతర అధికారులకు ఏయూ ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్, దూరవిద్య కేంద్రం గెస్ట్‌హౌస్‌లలో వసతి కల్పించారు. ఇక్కడ దోమల బెడద లేకుండా ముందు జాగ్రత్తగా జీవీఎంసీ సిబ్బంది ఫాగింగ్ చేస్తున్నారు.

**సౌకర్యాలకు కొదవ లేదు**

క్రీడా కారులకు సౌకర్యాల కల్పనలో అధికారులు రాజీపడలేదు. క్రీడా ప్రాంగణాలలో కూర్చుని పోటీలను వీక్షించడానికి వీలుగా కుర్చీలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ప్రత్యేకంగా ఉన్న పెవిలియన్ల నుంచి కూడా క్రీడాకారులు పోటీలను ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీలను వీక్షిస్తూ ప్రోత్సహించడం కనిపించింది. క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు. క్రీడలను వీక్షించేవారి కోసం ప్రత్యేకంగా టెంట్లు వేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడాకారులకు బిస్కట్ ప్యాకెట్లు, ఎనర్జీ డ్రింక్‌లను అందజేస్తున్నారు. వేదికల వద్ద ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రాల్లో.. ఆటల్లో భాగంగా తగిలిన చిన్నపాటి దెబ్బలకు చికిత్స చేసి, మందులు అందజేస్తున్నారు.



ప్రాథమిక చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది



ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది



క్రీడా ప్రాంగణాల వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్స్

## ధ్యాన మందిరంలో ఘంటసాల వర్ధంతి వేడుకలు



గల్లా చిట్టిబాబును సత్కరిస్తున్న షిర్డీసాయి ధ్యాన మందిర కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఆదివారం గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ధ్యాన మందింరలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందిర ప్రాంగణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గానసుధ, ఘంటసాల గాత్రంలో అలరించే గల్లా చిట్టిబాబు భక్తిగీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా గల్లా చిట్టిబాబు, బృంద సభ్యులను ఘనంగా సత్కరించారు. 25 ఏళ్లగా ధ్యాన మందిరంలో ఘంటసాల వర్ధంతి రోజున పేదలకు అన్నదానం, పలువరికి సత్కారాలు చేస్తున్నామని మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో ఘంటసాల అభిమానులు, ధ్యాన మందిర సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే పిల్లల్లో క్యాన్సర్ మరణాల నివారణ



డాక్టర్లతో క్యాన్సర్‌ను జయించిన చిన్నారులు

ఎంవీపీకాలనీ: అవగాహన, ముందస్తు గుర్తింపుతోనే పిల్లల్లో క్యాన్సర్ మరణాల నివారణ సాధ్యమవుతందని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. ప్రపంచ బాలల క్యాన్సర్ నివారణ డే సందర్భంగా ఎంవీపీ కాలనీలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, శ్రేయ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏటా 0 నుంచి 19 ఏళ్ల వయసు గల 4 లక్షల మంది చిన్నారులు క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. పిల్లల్లో క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ అత్యంత కీలకమన్నారు. ముందస్తు నిర్ధారణతో వారికి ప్రాణహాని లేకుండా చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్‌పై అవగాహన పెంచే దిశగా మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కృషి చేస్తున్నట్టు తెలిపారు. కేజీహెచ్ పీడియాట్రిక్స్ విభాగ హెచ్‌వోడీ డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ ఇతరులకు అవగాహన పెంచే విధంగా క్యాన్సర్‌ను జయించిన చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలిస్టాలిన్ చౌదరి, డాక్టర్ వి.ప్రవీణ, డాక్టర్ వై.రజనీ, డాక్టర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం పరిధిలో హై టెన్షన్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్, ఆపరేషన్ జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బాలయ్యశాస్త్రి లేఅవుట్, నరసింహనగర్, పద్మశ్రీ హాస్పిటల్ ఏరియా, ఎన్‌జీవోస్ కాలనీ, జీవీఎంసీ హైస్కూల్ ఏరియా, చిన్నూరు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

## 100 మందికి వైద్య సేవలు



నందగిరినగర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న లక్ష్మీగాయత్రి హాస్పిటల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 44వ వార్డు నందగిరినగర్‌లో ఆదివారం లక్ష్మీగాయత్రి హాస్పిటల్ సౌజన్యంతో నందగిరినగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా వివిధ ప్రాంతాల్లో పేదల కోసం ఉచిత మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాలనీలోని సుమారు 100 మందికి బీపీ, సుగర్ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్ రమేష్, సిబ్బంది, నందగిరినగర్ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వీర పరాక్రమ ధీరుడు హనుమంతుడు



సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

ఎంవీపీకాలనీ: సామవేదం షణ్ముఖ శర్మ హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీలో ఆదివారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా షణ్ముఖ శర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు నాలుగు రోజులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ మహావీర, పరాక్రమ, ధీరుడు హనుమంతుడు అని చెప్పారు. శ్రీ తులసీదాస్ మానవాళికి అందించిన హనుమాన్ చాలీసా జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ఒడిసిపట్టుకోడంతో పాటు పిల్లలకు తెలియజెప్పాలన్నారు. దీని ద్వారా మానసిక స్థైర్యం లభిస్తుందని చెప్పారు. ప్రవచనాలతో పాటు ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రవచనాల అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు.

# సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

- కళింగుల ఆత్మీయ కలయికలో వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ సమన్వయకర్త పేరాడ తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

మద్దిపాలెం: కళింగుల సామాజిక వర్గమంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటుందని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. ఖారవేల ఎడ్యుకేషనల్, కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పేడాడ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం 51వ వార్డు మాధవధార వుడా కాలనీ వుడా కమ్యూనిటీ హాల్‌లో కళింగ కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని దివంగత నేత బొడ్డేపల్లి రాజగోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ రాజకీయంగా గ్రామ, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కళింగులకు సీఎం వైఎస్ జగన్ ఎంతో విలువనిచ్చారని, శాసనసభాపతిగా తమ్మినేని సీతారంను ఎంచుకోవడం గర్వకారణమన్నారు. తనను శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా తమ కులస్తులంతా కలిసి తనను గెలిపించాలని కోరారు. ఈ కలయికకు సంఘ సభ్యులు మద్దతు పలికారని, అందరూ తన గెలుపునకు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కళింగ వర్గం అందరినీ కలుపుకుని ఒక వేదిక మీదకు తీసుకొచ్చిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణకుమారి తనకు మద్దతు పలికి సంఘీభావం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పప్పల రామ్మోహన్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రఘు, పైడాడ కృష్ణారావు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు సనపల చంద్రమౌళి, బెందాళం పద్మావతి, కార్యవర్గ సభ్యులు, సనపల నరసింహస్వామి, తమ్మినేని నర్సింగ్‌రావు, పప్పల సునీత, పైడి కృష్ణారావు మాస్టారు, బి.తిరుమలరావు, పొన్నాడ అప్పారావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా సీఐ రమేష్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు తమ తీరు మార్చుకుని సత్ప్రవర్తనతో మెలగాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, గొడవల్లో తలదూర్చి రౌడీయిజం చేస్తామంటే ఊరుకోమన్నారు. ప్రతి రోజు పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని, మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీసులు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

**దొంగతనాలపై ఆరా..**

ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు దొంగతనాలకు పాల్పడిన వారికి సీసీఎస్ ఏసీపీ వెంకటరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ చేశారు. పాత నేరస్తులు ఒక్కొక్కరినీ పిలిపించి గతంలో చేసిన దొంగతనాలపై ఆరా తీశారు. దొంగలకు సహకరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రతి రోజు మీరు ఎక్కడికి వెళ్లిన స్టేషన్ ఎస్ఐలకు తెలియజేయాలన్నారు. క్రైం ఎస్ఐలు భాస్కరరావు, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గౌరీ సేవా సంఘం వార్షికోత్సవం



సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న గౌరీ సేవా సంఘం సభ్యులు

తాటిచెట్లపాలెం: శ్రీ గౌరీ సేవా సంఘం (పోర్టు విభాగం) ఆధ్వర్యంలో ఆదివారం 43వ వార్షికోత్సవం మధురవాడ జాతర(శిల్పారామం)లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన పలువురు సీనియర్ సిటిజన్లను సన్మానించారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. పలు ప్రత్యేక, సాంస్కృతిక కార్యక్రమాలతో సభ్యులు సందడిగా గడిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు ఉల్లూరి వరాహ సత్యనారాయణ, అధ్యక్షుడు సూరిశెట్టి జగ్గ అప్పారవు, సెక్రటరీ పాలమరశెట్టి ఎస్‌జేవీ ప్రసాద్, కోశాధికారి రాపేటి చంద్రరావు, ఆడారి లచ్చ అప్పారావు, వేగి సత్యనారాయణ, ఆడారి సూర్యనారాయణ, బెద్దెడ భాస్కరరావు, దాడి గోవిందరాజు, భీశెట్టి అప్పారావు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావసరాల కోసమే చదును చేయించాం..

- స్వార్థ ప్రయోజనాల కోసమే తప్పుగా రాశారు
- 'ఈనాడు' వార్తను ఖండించిన సత్యసాయినగర్ కొండవాలు వాసులు



ఈనాడు తప్పుడు వార్తను ప్రచురించిందని ఖండిస్తున్న సత్యసాయినగర్ కొండవాలు ప్రజలు

తాటిచెట్లపాలెం: 'జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయినగర్ కొండవాలు ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలతో కొండను తొలిచేసి కబ్జా చేస్తున్నట్లు ఈనాడు దినపత్రికలో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవం. కేవలం ఒకరిద్దరి స్వార్థ ప్రయోజనాల కోసమే ఈ వార్తను రాశారు' అని సత్యసాయినగర్ మహిళలు, స్థానికులు ముక్తకంఠంతో ఖండించారు. ఈనాడు ప్రతులతో ఆదివారం వీరంతా ఇక్కడ నిరసన చేపట్టారు. సత్యసాయినగర్ కొండ ప్రాంతంలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు నిండిపోయి విషసర్పాలు వస్తున్నాయని, ఈ స్థలం ప్రజావసరాల కోసం వినియోగించుకునేందుకు అనుమతులు ఇప్పించాలని కాలనీ వాసులంతా భీమిలి ఎమ్మెల్యేను కలిసి విన్నవించుకున్నామన్నారు. ఈ క్రమంలో స్థలాన్ని శుభ్రం చేయించుకుంటుంటే.. కేవలం ఒకట్రెండు కుటుంబాలు దీనిని అడ్డుకుని, తప్పుడు వార్తలు రాయించారని స్థానిక మహిళలు దుయ్యబట్టారు. తామంతా కొండ మీద నివసిస్తున్నామని, ఏదైనా పూజలు జరిగినా, ఎవరైనా చనిపోయినా, వాహనాల పార్కింగ్ వంటి వాటికి చాలా ఇబ్బందిగా ఉందని, దీనికోసమే ఈ స్థలాన్ని చదును చేయించామని తెలిపారు. ప్రజావసరాల కోసం తామే ఈ శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నామని, తమ వెనుక ఏ రాజకీయ పార్టీలు లేవని వీరంతా స్పష్టం చేశారు.

# దొంగతనాలపై అప్రమత్తం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న క్రైం ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలోని సింహాద్రిపురం, సింహగిరి కాలనీల్లో ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటికి రక్షణగా ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తక్షణమే సంబంధింత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంట్లో నగదు, బంగారం బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలని చెప్పారు. ఊరు వెళ్లేటప్పుడు ఇంటి తాళాలు జాగ్రత్త పరచాలన్నారు. అపార్ట్‌మెంట్‌ల్లో రిజిస్టర్ బుక్ ఏర్పాటు చేసుకొని వచ్చే వారి వివరాలు నమోదు చేయాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

